సాక్షి అనంతపురం

గురువారం । 29 । జూన్ । 2023



టన్ను చీనీ రూ.23 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్ట ధర రూ.23 వేలు పలికాయి.



పరుగుల రాణి ప్రత్యూష

బుక్కపట్నం మండలం పాముదుర్తికి చెందిన ప్రత్యూష అథ్లెటిక్స్‌లో రాణిస్తోంది. పోటీలో దిగితే కచ్చితంగా పతకం సాధిస్తోంది. 8లో

గరిష్టం/కనిష్టం
35.2°/21.8°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

మున్సిపల్ కమిషనర్లకు అవగాహన



కమిషనర్లకు అవగాహన కల్పిస్తున్న డైరెక్టర్ ఆఫ్ స్టేట్ ఆడిట్ ఆర్.హరిప్రకాష్

కదిరి టౌన్: సీఎఫ్ఎంఎస్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ ప్రీ ఆడిట్ సిస్టమ్‌పై ఉమ్మడి అనంతపురం జిల్లా కమిషనర్లకు అవగాహన కల్పించారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో డైరెక్టర్ ఆఫ్ స్టేట్ ఆడిట్ ఆర్.హరిప్రకాష్ బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ పీవీవీఎస్ మూర్తి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

పుట్టపర్తి టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీ యువకులకు సిడాప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఏపీఎం లక్ష్మీనారాయణ, జాబ్ కోర్డినేటర్ ఆంజనేయులు తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏదైనా డిగ్రీ 60 శాతం మార్కులతో పాసైన నిరుద్యోగ యువతీ యువకులకు సిల్క్ కాలేజ్ విజయవాడ భవానిపురంలో మూడు నెలల పాటు అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు వేర్‌హౌస్ సూపర్ వైజర్ కోర్స్, కంప్యూటర్ నాలెడ్జ్, స్పోకెన్ ఇంగ్లిష్, జర్మన్ లాంగ్వేజ్‌పై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. 20 నుంచి 34 సంవత్సరాల్లోపు వయసున్న వారు అర్హులన్నారు. విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు ఆధార్‌కార్డు, పాస్ ఫొటోలతో పుట్టపర్తి వైకేపీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 96408 99337 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

విపత్తుల వేళ అండగా నిలవండి



పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: వరదలు, అగ్ని ప్రమాదాలు తదితర విపత్తులు సంభవించినపుడు బాధితులకు అండగా నిలవాలని అగ్నిమాపక సిబ్బందికి కలెక్టర్ గౌతమి సూచించారు. బుధవారం ఆమె జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.15 లక్షలు విలువైన 199 ఆధునిక విపత్తుల నివారణ పరికరాలను పరిశీలించారు. అలాగే రెస్క్యూ పరికరాల శిబిరాన్ని కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతపురంలోని లోతట్టు ప్రాంతాలు వరదలతో జలమయమైనపుడు అగ్నిమాపక సిబ్బంది ముందుండి ఒక్క ప్రాణ నష్టం కలగకుండా సేవలందించారని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ విధులు కొనసాగించాలన్నారు. రక్షణ, పునరావాస కార్యక్రమాల్లో బాధ్యతగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా చర్యలు చేపట్టేందుకు సంసిద్ధంగా ఉండాలన్నారు. జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కళ్యాణదుర్గంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి పి.లింగమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పేదింట విద్యావెలుగులు

- ప్రపంచాన్ని మార్చగలిగే శక్తివంతమైన ఆయుధం విద్య
- వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక విద్యారంగంలో సమూల మార్పులు
- జిల్లాస్థాయి 'జగనన్న అమ్మ ఒడి' పథకం ప్రారంభంలో విప్ కాపు రామచంద్రారెడ్డి



'జగనన్న అమ్మ ఒడి' మెగా చెక్కును విద్యార్థినులకు అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, కలెక్టర్ గౌతమి తదితరులు

రాప్తాడురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల కుటుంబాల్లో వెలుగులు నిండాయని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. నాలుగో విడత 'జగనన్న అమ్మఒడి' జిల్లాస్థాయి కార్యక్రమం బుధవారం నగరంలోని కేఎస్‌ఆర్ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణంలో జరిగింది. అనంతపురం ఎమ్మెల్యే అనంతవెంకటరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో విప్ కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రపంచాన్ని మార్చగలిగే శక్తి విద్యకే ఉందన్నారు. దీన్నిదృష్టిలో ఉంచుకునే పేద కుటుంబాల్లోని పిల్లలందరూ బాగా చదువుకోవాలనే ఆలోచనతో జగన్ ప్రభుత్వం ఎన్నో పథకాలను తీసుకొచ్చిందన్నారు. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చారన్నారు. జగనన్న అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా కానుక, నాడు నేడు తదితర అనేక కార్యక్రమాలతో ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మారాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల పిల్లలకు చదువు పట్ల ఆసక్తి పెరిగిందన్నారు. దేశ, రాష్ట్ర పురోగతికి విద్యే సూచిక అని నమ్మిన వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు.

అసమానతలకు విద్యతో చెక్

సమాజంలో అసమానతలు పోవాలంటే విద్య ఒక్కటే మార్గమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. అందుకే సీఎం వైఎస్ జగన్ విద్యకు పెద్ద పీట వేశారన్నారు. కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అమ్మఒడి పథకాన్ని అమలు చేశామన్నారు. ఏటా తల్లి ఖాతాలో రూ.15 వేలు జమ చేస్తున్నారన్నారు. వరుసగా నాల్గో ఏడాది తల్లుల ఖాతాల్లో ఈ డబ్బులు జమ చేశామన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ విద్యకు దూరం కాకూడదనేది ముఖ్యమంత్రి ఆలోచన అని అన్నారు. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ వసీం, రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, డిప్యూటీ మేయర్లు వాసంతి, కోగటం విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు.

విద్యతోనే బంగారు భవిత

కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ విద్య వల్లనే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. సాధారణంగా జూన్ మాసం వస్తే తల్లిదండ్రులు వారి పిల్లల చదువు కోసం ఎంతో ఆందోళన చెందే వారన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వమే 'జగనన్న అమ్మఒడి', 'జగనన్న విద్యా కానుక' లాంటి పథకాల ద్వారా ఆర్థిక భారాన్ని భరిస్తోందన్నారు. పేద కుటుంబాల్లోని పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు. జిల్లాలో 2,13,394 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.277.41 కోట్ల 'అమ్మ ఒడి' నగదు జమ కానున్నట్లు తెలిపారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా మెగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాసులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమాదేవి, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, డీఈఓ సాయిరామ్, డిప్యూటీ డీఈఓలు పద్మప్రియ, శంకర ప్రసాద్, డీవీఈఓ వెంకటరమణనాయక్ పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం ప్రసంగాన్ని ఈ సందర్భంగా విద్యార్థులు లైవ్‌లో తిలకించారు.

మామయ్యకు కృతజ్ఞతలు



జగన్ మామయ్య మాలాంటి నిరుపేదల కోసం తీసుకొచ్చిన 'అమ్మ ఒడి' పథకం ద్వారా వరుసగా నాలుగో సంవత్సరం మా అమ్మ బ్యాంకు ఖాతాలో డబ్బులు పడ్డాయి. చాలా సంతోషం. నాన్న ప్రైవేట్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అమ్మ ఇంట్లోనే ఉంటుంది. జేవీకే కిట్ ద్వారా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూ, యూనిఫాం, సాక్సులు, టై, బెల్ట్ అన్నీ ఇచ్చారు. ఈ డబ్బులతో యూనిఫాం స్టిచ్చింగ్ చేయించుకుంటా. జగన్ మామయ్యకు కృతజ్ఞతలు.

– దేవరపల్లి అక్షయ, పదో తరగతి, అనంతపురం

జూన్ నెల భయం పోయింది



మా నాన్న నర్సరీ మొక్కల వ్యాపారం చేస్తుంటాడు. వచ్చే సంపాదనంతా కుటుంబానికే సరిపోయేది. జూన్ నెల వచ్చిందటే యూనిఫాం, నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు కొనాలంటే ఆర్థికంగా ఇబ్బంది పడేవారు. ఇప్పుడా భయం లేదు. అమ్మ ఒడి పథకం ద్వారా వచ్చిన డబ్బులతో అవసరమైనవన్నీ కొనుక్కుంటున్నాం. తల్లిదండ్రులకు టెన్షన్ తప్పింది.

– సానియా, ఇంటర్ మొదటి సంవత్సరం, అనంతపురం

అప్రమత్తతతోనే రైలు ప్రమాదాలకు అడ్డుకట్ట



డీఆర్‌ఎం వెంకటరమణారెడ్డి

గుంతకల్లు: విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా రైలు ప్రమాదాలకు అడ్డుకట్ట వేయొచ్చని డీఆర్‌ఎం కె.వెంకటరమణారెడ్డి సూచించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం గుంతకల్లులోని రైల్వే క్లబ్‌లో సేఫ్టీ సెమినార్ నిర్వహించారు. రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్‌ఎం) కె.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా డ్యామ్, చెరువులు, కాలవలు, వంతెనల సమీపంలో రైలుమార్గం నిర్వహణ స్థితిపై దృష్టి సారించాలన్నారు. వాటర్‌వేలను శుభ్రపరచకోవడం ద్వారా ట్రాక్‌లపై వరదలు రాకుండా, రైళ్లు సాఫీగా నడిచేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సూర్యనారాయణ, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అటెండర్, సెక్యూరిటీ గార్డ్ అరెస్ట్

ఉరవకొండ: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన అటెండర్ రామాంజనేయులుతో పాటు అతడికి సహకరించిన సెక్యూరిటీ గార్డ్ జానకిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఉరవకొండ మార్కెట్‌యార్డు సమీపంలో వీరిని అరెస్ట్ చేశామని అర్బన్ సీఐ హరినాథ్ తెలిపారు. అటెండర్‌పై పోక్సో కింద, సెక్యూరిటీ గార్డ్‌పై ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపించామని వెల్లడించారు.

'ఇంటర్' ప్రవేశాలకు రేపు కౌన్సెలింగ్

అనంతపురం రూరల్: జిల్లాలోని సాంఘిక సంక్షేమశాఖ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులకు ఈ నెల 30న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ గురుకుల కళాశాలల జిల్లా కోఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కురుగుంట, నల్లమాడ, బ్రహ్మసముద్రం, ఉరవకొండ కళాశాలల్లో సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులకు మాత్రమే కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

తమ్ముళ్లు.. తన్నులాటలు

- తెలుగుదేశం పార్టీలో వర్గపోరు
- ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నాయకుల్లో నైరాశ్యం
- తమ్ముళ్ల తన్నులాటలతో పోలీసులకు రోజూ తలనొప్పే
- యువగళం మొదలు బస్సు యాత్ర వరకూ ఇదే పరిస్థితి
- జిల్లా అధ్యక్షులే గెలిచే పరిస్థితి లేదని పార్టీలో చర్చలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏ నియోజవర్గం చూసినా టీడీపీలో వేరుకుంపట్లు రగులుతూనే ఉన్నాయి. కదిరిలో ఇప్పటికే చాంద్‌బాషా, కందికుంట వర్గాలు పలుసార్లు రోడ్డెక్కి గొడవలకు దిగాయి. మొన్నటికి మొన్న పెనుకొండ నియోజకవర్గంలో సవితమ్మ, బీకే పార్థసారథి వర్గాలు రాళ్లు, చెప్పులతో కొట్టుకున్న తీరు పార్టీ దుస్థితిని చూపించింది. కళ్యాణదుర్గంలో ఉన్నం హనుమంతరాయ చౌదరి, ఉమామహేశ్వరనాయుడు వర్గాలు బస్సుయాత్ర సభలోనే తన్నుకున్నారు. దీంతో 'భవిష్యత్‌కు భరోసా' యాత్ర కాస్తా 'వర్గపోరు కులాసా' అన్నట్టు మారింది.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: టీడీపీలో వర్గపోరు రాజుకుంది. స్వపక్షంలోనే విపక్షం అన్నట్టు సొంత పార్టీలోనే గ్రూపులుగా విడిపోయి తన్నుకుంటున్నారు. ఎమ్మెల్యే టికెట్ తమ వారికని.. లేదు తమ వారికని వాగ్వాదానికి దిగి కలబడుతున్నారు. రెండు వర్గాలను అదుపులోకి తీసుకోవడం పోలీసులకు తలనొప్పిగా మారుతోంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా చేస్తున్న బస్సుయాత్ర కార్యకర్తల గొడవలతో రచ్చరచ్చగా మారింది.

నాయకుల్లో అసంతృప్తి

లోకేష్ యువగళం యాత్ర సమయంలోనే టీడీపీ నియోజకవర్గ ముఖ్య నాయకుల్లో అసంతృప్తి బయటపడింది. శింగనమలలో పార్టీ నాయకురాలు బండారు శ్రావణి తండ్రిపై దాడిచేసినా దిక్కులేదు. ఇక్కడ త్రీమెన్ కమిటీ, బండారు శ్రావణి వర్గాలు ఉన్నాయి. కళ్యాణదుర్గంలో ఉన్నం, మారుతి, పెనుకొండలో సవితమ్మ, పార్థసారథి వర్గాలు నిత్యం యుద్ధం చేసుకుంటున్నాయి. ఇక పుట్టపర్తిలో పల్లె రఘునాథరెడ్డిపై వ్యతిరేకవర్గం రోజూ ఒక ఆరోపణ చేస్తూనే ఉంది. గుంతకల్లులో జితేందర్‌గౌడ్ ఎక్కడున్నాడో చెప్పండని కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం అర్బన్‌లో ప్రభాకర్ చౌదరికి సొంతపార్టీలోనే శత్రువులు పెరుగుతున్నారు. మడకశిరలో నాయకుడెవరో తెలియని పరిస్థితి. ఇక తాడిపత్రిలో జేసీ కుటుంబంతో ఏ నాయకుడికీ సంబంధాలు లేవనేది బహిరంగ సత్యం. దీనికి తోడు తాము గెలవలేమేమో అన్న అనుమానంతో జేసీ వర్గీయులు వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు తెగపడుతున్న పరిస్థితి నెలకొంది. పరిటాల కుటుంబంపై జిల్లాలో సొంతపార్టీలోనే తీవ్ర అసంతృప్తి రగులుతోంది. పరిటాల శ్రీరామ్‌కు జిల్లాలో ఎక్కడ సీటు ఇచ్చినా ఓడిపోవడం ఖాయమని పరిటాల వ్యతిరేక వర్గం ఆరోపిస్తోంది. కుటుంబానికి ఒకటే టికెట్ అన్న చంద్రబాబు ఇప్పుడు ఇద్దరికి టికెట్లు ఇవ్వడానికి ఎలా సిద్ధమయ్యారని వ్యతిరేకవర్గం ప్రశ్నిస్తోంది.



జిల్లా అధ్యక్షుల గెలుపుపైనా సందిగ్ధమే

జిల్లాల పునర్విభజన అనంతపురం శ్రీసత్యసాయి జిల్లాకు పార్థసారథిని, అనంతపురం జిల్లాకు కాలవ శ్రీనివాసులును టీడీపీ జిల్లా అధ్యక్షులుగా నియమించారు. కానీ పార్థసారథికి టికెట్ రాదని, ఒకవేళ ఇచ్చినా ఓడిపోతారని కొందరంటుంటే.. రాయదుర్గంలో కాలవ శ్రీనివాసులుకు టికెట్ ఇస్తే ఓడిపోతారని, ఈ పరిస్థితుల్లో వీళ్లిద్దరికీ టికెట్లు ఇవ్వడం మంచిది కాదని వ్యతిరేక వర్గాలు అంటున్నాయి. కాలవ శ్రీనివాసులు సమన్వయంతో వ్యవహరించడం లేదని, వీళ్లిద్దరినీ జిల్లా పార్టీ అధ్యక్షులుగా ఎవరూ గుర్తించడం లేదని కార్యకర్తలు బహిరంగంగానే చెబుతున్నారు. అన్నిటికీ మించి ప్రస్తుత ప్రభుత్వం నుంచి లబ్ధిపొందుతున్న వారిలో టీడీపీ వారే ఎక్కువ మంది ఉన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పటికంటే ఈ ప్రభుత్వ హయాంలోనే వాళ్లు లబ్ధిపొందారు. ఈ పరిస్థితుల్లో ఆయా వర్గాలు తమకు ఓటేస్తారా అన్న అనుమానం నాయకులను వేధిస్తోంది.

అత్యాచారయత్నం కేసులో ముద్దాయికి జైలు

అనంతపురం: అత్యాచారయత్నం కేసులో ముద్దాయికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నాలుగవ అదనపు జిల్లా జడ్జి శోభారాణి తీర్పు చెప్పారు. 2015 అక్టోబర్ 24న అనంతపురంలోని కమలానగర్‌లో ఒంటరిగా నివసిస్తున్న మహిళ ఇంట్లోకి గంగాధర్ అనే వ్యక్తి చొరబడ్డాడు. అత్యాచారానికి ప్రయత్నించగా ఆమె గట్టిగా అరిచింది. భయపడిన గంగాధర్ అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై సెక్షన్ 376 ఆర్/డబ్ల్యూ 511 ఐపీసీ కింద కేసు నమోదు చేశారు. విచారణ తరువాత కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో భాగంగా ప్రత్యేక ప్రాసిక్యూటర్ సుజన బాధితురాలి తరఫున 6 మంది సాక్షులను విచారించారు. కేసు పూర్వాపరాలు, ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి శోభారాణి.. ముద్దాయి గంగాధర్‌కు రెండు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు.


ముస్లింలకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు



కళ్యాణదుర్గం /అనంతపురం అర్బన్: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషశ్రీచరణ్ ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. అల్లా సూచించిన సన్మార్గంలో ముస్లింలు నడవాలని కోరారు. తోటి వారి పట్ల ప్రేమ, స్నేహంతో మెలగాలన్నారు. ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

- ముస్లింలకు కలెక్టర్ గౌతమి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. త్యాగనిరతికి ప్రతీకగా భావించే బక్రీద్ పండుగను ముస్లిం ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.
- పేద, ధనిక తారతమ్యం లేకుండా రాగద్వేషాలకు అతీతంగా గురువారం బక్రీద్ జరుపుకోవాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముస్లింలకు సూచించారు.

నేడు బక్రీద్



అనంతపురం సప్తగిరి సర్కిల్‌లోని ఈద్గా మసీదు

అనంతపురం సిటీ: ఈద్ – అల్ –అదా (బక్రీద్) పర్వదినాన్ని ముస్లింలు గురువారం జరుపుకోనున్నారు. రంజాన్ తరువాత అత్యంత పవిత్రంగా భావించే పండుగల్లో బక్రీద్ ఒకటి. జిల్లా వ్యాప్తంగా ఈద్గాలు, మసీదులను ప్రత్యేక ప్రార్థనల కోసం సిద్ధం చేశారు. ఇందులో భాగంగా అనంతపురం హౌసింగ్ బోర్డులోని ఈద్గాను సుందరంగా తీర్చిదిద్దారు. ఈద్గా మైదానంతో పాటు బహిరంగ ప్రదేశాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసుకోవచ్చని కలెక్టర్ గౌతమి అనుమతినిచ్చినట్లు మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి మహమ్మద్ రఫీ బుధవారం తెలిపారు. అయితే కోవిడ్ జాగ్రత్తలు, నియమాలు పాటించాలని సూచించారు. నమాజుకు ముందు వజూ(కాలకృత్యాలు తీర్చుకోవడం) కోసం నీటి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఇమామ్‌లు ఖుద్బాను సజావుగా జరిపించాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో జంతువులు కొనుగోలు చేయడం నిషేధమన్నారు. నిర్దేశిత ప్రదేశాల్లోనే గొర్రెలు కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాలు, వీధుల్లో జంతువులను వధించకూడదని స్పష్టం చేశారు.

మరోసారి తుస్సుమన్న బస్సు యాత్ర

- రాయదుర్గంలో మొరాయించిన రథయాత్ర ప్రచార రథం
- యాత్రకు ప్రజల నుంచి స్పందన కరువు
- కాలినడకన వెళ్లిన టీడీపీ నాయకులు



ప్రచార రథానికి మరమ్మతులు చేయిస్తున్న దృశ్యం

రాయదుర్గం: 'భవిష్యత్తుకు గ్యారంటీ' అంటూ టీడీపీ నాయకులు చేపట్టిన బస్సు యాత్ర మరోసారి తుస్సుమంది. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఇలాకాలో ప్రచార రథం మొరాయించడం, ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో పార్టీ కేడర్ డీలా పడిపోయింది. యాత్రకే గ్యారంటీ లేకుంటే.. ఇక ప్రజల భవిష్యత్తుకు ఏమి గ్యారంటీ ఇస్తారంటూ ప్రజలు చర్చించుకోవడం కనిపించింది. ఇటీవల రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం పేరూరులో మాజీ మంత్రి పరిటాల సునీత బస్సు యాత్ర చేపట్టారు. అక్కడ డీజిల్ లేక బస్సు ముందుకు కదలలేదు. తాజాగా బుధవారం ఉదయం రాయదుర్గంలోకి బస్సుయాత్ర చేరుకుంది. రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం వద్ద ప్రత్యేకంగా తయారు చేయించిన ప్రచార రథంపైకి ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, మాజీ మంత్రి పరిటాల సునీత, మాజీ ఎమ్మెల్యేలు బీకే పార్థసారథి, పల్లె రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో కలసి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు చేరుకున్నారు. డీజే సౌండ్ సిస్టం హోరులో 'తమ్ముళ్లు' ఊగుతూ స్టెప్పులు వేశారు. అయితే ప్రచార రథం ముందుకు కదలకుండా మొరాయించింది. ఎంత ప్రయత్నించినా ప్రయోజనం లేకపోవడంతో నాయకులు కిందకు దిగేశారు. ప్రజలు కూడా ఆశించినస్థాయిలో రాలేదు. పది వేల మంది వస్తారని అంచనా వేసినా 2వేల మందిలోపే కనిపించారు. జనం లేక రోడ్లు పలచగా కనిపించడంతో బళ్లారి రోడ్డులోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నిర్వహించాల్సిన బహిరంగ సభను రద్దు చేసి, వినాయక సర్కిల్ వద్దే కార్యక్రమం ముగించాల్సి వచ్చింది. జన సమీకరణ వైఫల్యం, ప్రచార రథం మొరాయించడంపై కాలవ శ్రీనివాసులు స్థానిక నాయకులపై తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా రాయదుర్గం నియోజకవర్గ టీడీపీలోనూ నేతల మధ్య వర్గపోరు నివురుగప్పిన నిప్పులా రాజుకుంటోంది. పార్టీ నియోజకవర్గ నాయకత్వంపై సీనియర్లు అసంతృప్తితో బస్సు యాత్రకు దూరంగా ఉండిపోయారు. అంతేకాదు ఈసారి ఎమ్మెల్యే టికెట్ స్థానిక నేతలకు ఇవ్వాలనే వాదనను తెరపైకి తీసుకొచ్చారు.

'అది బోగస్ యాత్ర'

కళ్యాణదుర్గం: భవిష్యత్తుకు భరోసా పేరిట టీడీపీ చేపట్టిన బస్సు యాత్ర.. బోగస్ యాత్ర అని మంత్రి ఉషశ్రీచరణ్ ఎద్దేవా చేశారు. 'కళ్యాణదుర్గం నియోజకవర్గంలో చేపట్టిన బస్సు యాత్రపై మంత్రి బుధవారం స్పందించారు. టీడీపీ కార్యకర్తలే బస్సు యాత్రపై రాళ్లు రువ్వే దుస్థితిలో ఉన్నారని గుర్తు చేశారు. సొంతపార్టీ కార్యకర్తలపైనే రాళ్లతో దాడి చేయించడంపై మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి రౌడీయిజం మరోమారు బయటపడిందన్నారు. నియోజకవర్గంలో సొంత పార్టీ కార్యకర్తలకు మేలు చేయని వారు ఏ మొహం పెట్టుకుని బస్సు యాత్ర చేస్తారని విమర్శించారు. చంద్రబాబు గత ఎన్నికల ముందు రైతులు, డ్వాక్రా సంఘాల రుణాలను మాఫీ చేస్తామని ఇచ్చిన మాటను తుంగలోకి తొక్కారని మండిపడ్డారు. ప్రజలను మరోసారి మోసం చేసే బస్సు యాత్రలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. టీడీపీ, జనసేన కుమ్మక్కై ఎన్ని బస్సు యాత్రలు చేసినా అవి తుస్సుమంటాయని మంత్రి స్పష్టం చేశారు.

3న రాష్ట్రస్థాయి భజన పోటీలు

బొమ్మనహళ్: గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా జూలై మూడో తేదీన నక్కలపల్లిలోని శ్రీషిర్డీసాయి దేవాలయంలో రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్టు ఆలయ సేవా కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు తెలిపారు. పోటీల్లో 8 నుంచి 12 మంది సభ్యులు ఉండే బృందాలు పాల్గొనవచ్చన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి


నవీన్ (ఫైల్)

నార్పల: ఆత్మహత్యాయత్నం చేసిన ఓ బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... నార్పలకు చెందిన చిలమకూరి గోపాల్ కుమారుడు నవీన్ (16) ఇటీవల పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాశాడు. ఐదు రోజుల క్రితం ఫలితాలు వెలువడ్డాయి. సప్లిమెంటరీ పరీక్షల్లోనూ ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్తాపానికి లోనై క్రిమి సంహారక మందు తాగాడు. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ఐదు రోజులుగా అక్కడే చికిత్స పొందుతున్న నవీన్ ఆరోగ్య పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల నార్పల సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, తదితరులు నవీన్ మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రాజశేఖరరెడ్డి తెలిపారు.

పరుగుల రాణి ప్రత్యూష



దాదాపు ఏడెనిమిదేళ్ల క్రితం గ్రామీణ రహదారిపై ఆమె పరుగు తీస్తుంటే అందరూ ఆశ్చర్యంగా చూసేవారు. ఆమె ఎటు వైపు వెళితే అటుగా తమ దృష్టి సారించేవారు. కొందరైతే ఆడపిల్లకు ఈ పరుగులు అవసరమా? అని బుగ్గలు నొక్కుకునేవారు. అయినా ఆమె వెనుకంజ వేయలేదు. తర్వాతి రోజుల్లో జిల్లా అథ్లెటిక్స్‌కు ఆమె కొత్తదారి చూపించింది. ఎవరూ ఊహించని రీతిలో చిరస్మరణీయ ఘనతలు సొంతం చేసుకుంది. కృషి, పట్టుదలతో తాను అనుకున్నది సాధించిన ఆమెనే ప్రత్యూష. అథ్లెటిక్స్‌లో రాణిస్తూ గ్రామీణ ప్రాంతం నుంచి చైనాలో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన ప్రత్యూష క్రీడా ప్రస్థానంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

- అథ్లెటిక్స్ పోటీల్లో రాణిస్తున్న గ్రామీణ విద్యార్థిని
- ఈ ఏడాది అంతర్జాతీయ పోటీలకు ఎంపిక

ముదిగుబ్బ: ధర్మవరం నియోజకవర్గ పరిధిలోని ముదిగుబ్బ ఎస్‌డీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం బీకాం కంప్యూటర్స్ చదువుతున్న చెలిమి ప్రత్యూష అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. ఈ ఏడాది జూలై 28 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకూ చైనాలోని చెంగుడులో జరిగే అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో భారతదేశం తరఫున పరుగు పోటీల్లో ఆమె పాల్గొననుంది.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..

పుట్టపర్తి నియోజకవర్గంలోని బుక్కపట్నం మండలం పాముదుర్తి గ్రామానికి చెందిన చెలిమి మోహన్, లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వీరిలో ప్రత్యూష పెద్ద కుమార్తె. చేనేత కార్మికులుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. కుమార్తెలను వారు ఏనాడు ఆడపిల్లగా చూడలేదు. మగపిల్లలతో సమానంగా వారికి అన్ని అవకాశాలు కల్పిస్తూ వచ్చారు. 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు పాముదుర్తి ప్రభుత్వ పాఠశాలలోనే ప్రత్యూష చదువుకుంది. ఏడో తరగతిలో ఉన్నప్పుడు నిర్వహించిన పాఠశాల స్థాయి ఆటపోటీల్లో ప్రతిభ కనబరిచిన ప్రత్యూషలోని అథ్లెట్‌ను గుర్తించిన పీఈటీ ప్రకాష్‌రెడ్డి ఆమెను వెన్ను తట్టి ప్రోత్సహిస్తూ వచ్చారు. పీఈటీ పర్యవేక్షణలో ఆమె పరుగు, లాంగ్ జంప్‌లో రాటు దేలింది. అనంతరం తల్లిదండ్రులు ప్రోత్సహించడంతో కోచ్‌లు రమేష్, సురేష్ వద్ద ప్రత్యేక శిక్షణ పొందిన ప్రత్యూష.. పరుగుల రాణిగా ఖ్యాతిగడించింది.

పోటీలకు వెళితే పతకాలే..

పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి ఇప్పటి వరకూ ప్రత్యూష ఏ పోటీకి వెళ్లినా.. పతకంతో తిరిగి వస్తోంది. తొలిసారిగా పదో తరగతి విద్యార్థిగా ఉన్నప్పుడు కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అనంతపురం జిల్లా తరఫున ప్రాతినిథ్యం వహించి, బంగారు పతకం సాధించింది. ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు గుజరాత్‌లోని వడోదరలో నిర్వహించిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఏపీ తరఫున పాల్గొని లాంగ్ జంప్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అనంతరం రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో


జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకాన్ని అందుకుంటున్న దృశ్యం (ఫైల్)

పాల్గొని వంద మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఇప్పటి వరకూ రాష్ట్ర స్థాయిలో 29, జాతీయ స్థాయిలో 5 పతకాలు ఆమె సొంతమయ్యాయి.

జాతీయ స్థాయిలో ఇలా..

- 2016లో గుజరాత్‌లో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని లాంగ్‌జంప్ విభాగంలో 4వ స్థానంలో నిలిచింది.
- 2018లో గుంటూరులో నిర్వహించిన జూనియర్ నేషనల్ లెవల్ లాంగ్‌జంప్, వంద మీటర్ల పరుగు పోటీల్లో పాల్గొని బంగారు పతకాలు దక్కించుకుంది.
- 2019లో చత్తీష్‌ఘడ్‌లో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని లాంగ్ జంప్ విభాగంలో వెండి పతకాన్ని కైవసం చేసుకుంది.
- 2022లో గుంటూరు వేదికగా జరిగిన సౌత్ జోన్ పోటీల్లో పాల్గొని వంద మీటర్ల పరుగు విభాగంలో వెండి, లాంగ్ జంప్‌లో బంగారు పతకాలను దక్కించుకుంది.
- ఈ నెల 14, 15 తేదీల్లో భువనేశ్వర్‌లోని కిట్ యూనివర్సిటీ వేదికగా జరిగిన అంతర్జాతీయ పోటీల ఎంపికలో ప్రతిభ చాటుకుంది. 200 మీటర్ల పరుగులో నిర్ణీత 25.10 నిమిషాల్లో 200 మీటర్ల పరుగు పూర్తి చేయాల్సి ఉండగా 24.29 నిమిషాల్లోనే అధిగమించి మొదటి స్థానంలో నిలిచి, చైనాలో జరిగే అథ్లెటిక్స్ పోటీలకు భారతదేశం తరఫున పాల్గొనే అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకుంది. అలాగే భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో నేషనల్ ఇంటర్ స్టేట్ సీనియర్ అథ్లెటిక్స్-23 చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని రిలే పరుగులో వెండి పతకాన్ని కైవసం చేసుకుంది.


తల్లిదండ్రులు, చెల్లెలు శిరీషతో...


సాధించిన పతకాన్ని చూపుతున్న ప్రత్యూష

పరిటాల శ్రీరామ్‌పై కేసు నమోదు

కనగానపల్లి: టీడీపీ నాయకుడు పరిటాల శ్రీరామ్‌పై కనగానపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. 'భవిష్యత్తు గ్యారంటీ' పేరిట సోమవారం పరిటాల సునీత ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు రాప్తాడు నుంచి పేరూరు వరకూ బస్సు యాత్ర చేపట్టిన విషయం తెల్సిందే. ఈ సందర్భంలో మండలంలోని రాంపురం గ్రామం వద్ద పరిటాల శ్రీరామ్‌తో పాటు అతని అనుచరులు తమపై ఘర్షణకు దిగి, నానా దుర్భాషలాడరని వైఎస్సార్‌సీపీ కార్యకర్త వడ్డే రాఘవేంద్ర మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు చేపట్టి పరిటాల శ్రీరామ్, అతని అనుచరులు తూంచర్ల హరి, కుర్లపల్లి చంద్రా, రాజుపై ఐపీసీ 341, 506, 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హనుమంతరెడ్డి తెలిపారు.

గణితానికి ఆద్యులు భారతీయులే

- యూపీఎస్‌సీ మాజీ సభ్యుడు వై.వెంకట్రామిరెడ్డి


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకట్రామిరెడ్డి, ఎస్కేయూ వీసీ రామకృష్ణారెడ్డి, తదితరులు

అనంతపురం: గణితానికి ఆద్యులు భారతీయులేనని, భారతీయ శాస్త్రవేత్తల కృషితోనే గణిత శాస్త్రంలో విప్లవాత్మక ఆవిష్కరణలు సాధ్యమయ్యాయని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్‌సీ) మాజీ సభ్యుడు డాక్టర్ వై.వెంకట్రామిరెడ్డి అన్నారు. విశ్వంలోని ప్రతి అంశం గణితంతో ముడిపడి ఉందని నిరూపించింది భారతీయులేనని అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని మేథమేటిక్స్ విభాగంలో 'గణితశాస్త్రం - సాంకేతికతలో ఆవిష్కరణలు - అభివృద్ధి' అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. ఉన్నత విద్యామండలి, ఎస్కేయూ, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన సదస్సును ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వై.వెంకట్రామిరెడ్డి ప్రారంభించి, మాట్లాడారు. వర్చువల్‌గా ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి ప్రసంగించారు. గణిత శాస్త్రం లేనిదే ఇంజినీరింగ్ లేదన్నారు. కోర్ గ్రూపులకైనా, సాఫ్ట్‌వేర్ రంగానికైనా మేథమేటిక్స్ తల్లిలాంటిదన్నారు. గణితంపై పట్టు సాధిస్తే ఉన్నత ఉద్యోగాలు సాధించడం సులువన్నారు. వివిధ దేశాల నుంచి 200 మంది పూర్వ విద్యార్థులు ఈ సదస్సులో వర్చువల్‌గా, నేరుగా పేపర్ ప్రజెంటేషన్ చేయడం గర్వకారణమన్నారు. ఇలాంటి సదస్సులతో జ్ఞానమార్పిడికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గణితం ఉపయోగాలు, సాంకేతిక రంగంలో పాత్రను వివరించారు. వర్సిటీలో మేథమేటిక్స్ విభాగం పురోగతికి కృషి చేసిన ప్రొఫెసర్ల పనితీరు ప్రశంసనీయమన్నారు. మేథమేటిక్స్ ప్రొఫెసర్ ఎ.మల్లికార్జునరెడ్డి అంకితభావంతో విధులు నిర్వర్తించారన్నారు. ఐఐఎస్ఈఆర్ తిరుపతి ప్రొఫెసర్ డీఎస్ నాగరాజు, ప్రోగ్రాం కన్వీనర్ ప్రొఫెసర్ శోభాలత, ఐఐఎస్‌సీ బెంగళూరు ప్రొఫెసర్ చలువరాజ్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.కృష్ణకుమారి పాల్గొన్నారు.

నగల దుకాణంలో చోరీ


వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

తాడిపత్రి అర్బన్: నగల దుకాణంలో దొంగలు పడిన ఘటన తాడిపత్రిలో సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు.. స్థానిక మెయిన్ బజార్‌లో నగల దుకాణాన్ని నిర్వహిస్తున్న గౌస్.. మంగళవారం రాత్రి వ్యాపారాన్ని ముగించుకుని దుకాణానికి తాళం వేసి ఇంటికెళ్లి నిద్రించాడు. బుధవారం ఉదయం వచ్చి షట్టర్‌కున్న తాళం తీసి లోపలకు వెళ్లి చూడగా దుకాణంలోని సామగ్రి అంతా చెల్లాచెదురుగా పడి ఉంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుకాణం వెనుక గోడకున్న రంధ్రం నుంచి దుండగులు లోపలకు ప్రవేశించి 80 తులాల వెండి సామగ్రి అపహరించుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలోకి దించి నిందితుల వేలి ముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

తాడిపత్రి అర్బన్: ఇంటర్ చదువుతున్న దళిత బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసిన వ్యక్తిపై తాడిపత్రి పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ధరణీబాబు తెలిపిన వివరాల మేరకు...వైఎస్సార్ జిల్లా కాశీనాయన మండలం నరసాపురంలోని ఏపీ మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ బాలిక(17) తాడిపత్రి పట్టణంలోని తన పిన్ని ఇంటిలో ఉండేది. కర్నూలు జిల్లా కొలిమిగుండ్లకు చెందిన బంధువు ఒకరు తన ఇంట్లో జరుగుతున్న శుభాకార్యానికి బాలికను తీసుకువచ్చేందుకు ఆరు నెలల క్రితం కారులో హాస్టల్‌కు వెళ్లాడు. బాలికను తీసుకుని తాడిపత్రిలోని ఆమె పిన్ని ఇంటికి తీసుకువచ్చాడు. ఈ క్రమంలో కారు డ్రైవర్ అఫీజ్, బాలిక మధ్య పరిచయం ఏర్పడింది. ఈ పరిచయాన్ని అడ్డుగా పెట్టుకుని అఫీజ్ బాలికకు మాయ మాటలు చెప్పాడు. వివాహం చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. ఇదే విషయాన్ని అతనికి చెప్పి పెళ్లి చేసుకోవాలని కోరింది. అయితే అఫీజ్ సాకులు చెబుతూ మోహం చాటేస్తుండటంతో బాలిక బుధవారం పట్టణ పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు బాలిక ఫిర్యాదు మేరకు పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేశారు. నిందితుడు అఫీజ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

'సూక్ష్మ' పరికరాల పంపిణీ వేగవంతం చేయాలి

- ఎంఐ ఇంజనీర్లు, డీసీఓలకు పీడీ ఫిరోజ్‌ఖాన్ ఆదేశం

అనంతపురం అగ్రికల్చర్: వర్షాలు పడుతున్న నేపథ్యంలో రైతులు ఇబ్బంది పడకుండా డ్రిప్, స్ప్రింక్లర్లు (బిందు,తుంపర) పరికరాల పంపిణీ వేగవంతం చేయాలని ఏపీఎంఐపీ పీడీ జి.ఫిరోజ్‌ఖాన్ ఆదేశించారు. బుధవారం స్థానిక ఏపీఎంఐపీ కార్యాలయంలో ఎంఐ ఇంజనీర్లు, ఎంఐఏఓలు, డ్రిప్ కంపెనీ డీసీఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 2022-23లో 386 హెక్టార్లకు బిందు, తుంపర సేద్య పరికరాలు మంజూరు చేశామని, అందులో ఇంకా ఎక్కడైనా మెటీరియల్ సరఫరా పెండింగ్‌లో ఉంటే జూలై 10వ తేదీలోపు ఇవ్వాలన్నారు. మెటీరియల్ సరఫరా చేసి ఇన్‌స్టలేషన్ పెండింగ్‌లో ఉంటే వెంటనే తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే గతేడాది మంజూరు చేసిన 13,697 హెక్టార్లకుగానూ ఇప్పటి వరకు 10 వేల హెక్టార్లకు ట్యాగింగ్ పూర్తి చేశారని, 8,800 హెక్టార్ల పరికరాలను తనిఖీలు చేశారన్నారు. పెండింగ్‌లో ఉన్న ట్యాగింగ్, తనిఖీలు, ఇన్‌స్టలేషన్, మెటీరియల్ సరఫరా... ఇవన్నీ జూలై నెలాఖరుకు వంద శాతం పూర్తి చేయాలని కమిషనరేట్ నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఓ వైపు ఈ ప్రక్రియ కొనసాగిస్తూనే.... 2023-24 ఆర్థిక సంవత్సరంలో 12,500 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ చేపట్టాలని ఆదేశించారు. ఆర్‌బీకేల వేదికగా ఇప్పటి వరకు 30,997 మంది రైతులు 43 వేల హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్లు కావాలని ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. అందులో 1,450 మంది రైతులు 1,762 హెక్టార్లకు తమ వాటా కింద సొమ్ము కూడా చెల్లించారని తెలిపారు. మొదటి విడతగా ఇటీవల 205 హెక్టార్లకు పరికరాల మంజూరు చేశామన్నారు. రిజిస్ట్రేషన్లు, మంజూరులో అనంతపురం జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో కొనసాగుతోందని తెలిపారు.

శభాష్ వలంటీర్

- ముంబైకి వెళ్లి 'అమ్మఒడి' ఈ-కేవైసీ చేయించిన వైనం


ముంబైలో మేడసారి లక్ష్మితో ఈ-కేవైసీ చేయిస్తున్న వలంటీర్ ఆదినారాయణ

యాడికి: ప్రభుత్వ సేవలు లబ్ధిదారుల ఇళ్ల ముంగిళ్లలోనే అందించేందుకు ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. సచివాలయ ఉద్యోగులతో పాటు వలంటీర్లు ప్రజలకు సత్వర సేవలందిస్తున్నారు. లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా వారు ఎక్కడుంటే అక్కడికే వెళ్లి వలంటీర్లు సేవలందిస్తున్నారు. ఈ క్రమంలో యాడికి మండలం లక్షుంపల్లె గ్రామ సచివాలయ వలంటీర్ ఆదినారాయణ స్వామి ఏకంగా ముంబై వెళ్లాడు. ఓ విద్యార్థికి 'అమ్మఒడి' పథకం అందించేందుకు అతని తల్లి వేలిముద్ర కోసం 900 కి.మీ దూరం ప్రయాణించి ఈ-కేవైసీ చేయించాడు. వివరాల్లోకి వెళితే..యాడికి మండలం కేశవరాయుని పేటకు చెందిన మేడసారి లక్ష్మి, నీలేష్ దంపతులు 6 నెలల క్రితం ముంబై వెళ్లి స్టీమర్‌లో దినసరి కూలీలుగా పనులు చేస్తున్నారు. వీరి కుమారుడు నిఖిల్ గ్రామంలో నానమ్మ వద్ద ఉంటూ రాయలచెరువు గ్రామంలోని సీవీ రమణారెడ్డి ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. నిఖిల్‌కు 'జగనన్న అమ్మఒడి' పథకం మంజూరు కాగా, ఇందుకు అతని తల్లి వేలిముద్ర వేయాల్సి ఉంది. దీంతో లక్షుంపల్లె గ్రామ సచివాలయ వలంటీర్ ఆదినారాయణ స్వామి రైలులో ముంబై వెళ్లి బుధవారం మేడసారి లక్ష్మితో ఈ-కేవైసీ చేయించారు. విద్యార్థికి 'జగనన్న అమ్మఒడి' అందేలా చూశాడు. దీంతో వలంటీర్ ఆదినారాయణను యాడికి ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి రాజు యాదవ్, గ్రామ సర్పంచు పద్మనాభరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి అభినందించారు.

ప్రొఫెసర్లుగా పదోన్నతి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో ఆరుగురు అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు బుధవారం ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన పాలకమండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. పదోన్నతి పొందిన వారిలో ఫిజిక్స్ విభాగం డాక్టర్ ఎం. రాంగోపాల్, కంప్యూటర్ సైన్సెస్ విభాగం డాక్టర్ వి.రఘునాథరెడ్డి, తెలుగు విభాగం డాక్టర్ ఎస్.ఆర్.సదాశివారెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ ఎంవీ శ్రీనివాసన్, బయోటెక్నాలజీ విభాగం డాక్టర్ డి.మురళీధర్ రావు, అనిత ఉన్నారు. అలాగే జూలై 17న నిర్వహించే స్నాతకోత్సవానికి సంబంధించి ముగ్గురికి డాక్టరేట్ ప్రదానం చేసే అంశానికి పాలక మండలి ఆమోదం తెలిపింది.

క్లుప్తంగా

ముళ్ల చెట్ల తొలగింపు



జేసీబీతో ముళ్ల చెట్లను తొలగిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని సనప గ్రామంలో శ్మశానానికి వెళ్లే దారిలో ముళ్లకంపలు ఉండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. మంగళవారం కలెక్టర్ గౌతమి జగనన్న సురక్ష సర్వే కార్యక్రమానికి రాగా ప్రజలు సమస్యను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాలతో బుధవారం సనపలో సర్పంచ్ గౌతమి జేసీబీతో శ్మశానానికి వెళ్లే దారిలోని ముళ్ల కంపను తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

హౌసింగ్ ఏఈగా సంపత్

అనంతపురం టౌన్: గృహ నిర్మాణ శాఖ గుంతకల్లు రూరల్ అసిస్టెంట్ ఇంజినీర్‌గా సంపత్‌ను నియమిస్తూ ఆ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కేశవనాయుడు బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. ప్రస్తుతం అక్కడ ఏఈగా పని చేస్తున్న జనార్దన్‌బాబు శుక్రవారం పదవీ విరమణ చేయనున్నారు. దీంతో గృహ నిర్మాణ సంస్థ పీడీ కార్యాలయంలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న సంపత్‌ను గుంతకల్లు రూరల్ రెగ్యులర్ ఏఈగా నియమించారు.

రూరల్ సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ



వెంకటనారాయణ

అనంతపురం టౌన్: రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా వెంకటనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. వైఎస్సార్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో చిట్స్ విభాగం సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న వెంకటనారాయణను ఉన్నతాధికారులు అనంతపురం రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. దీంతో ఆయన బాధ్యతలు చేపట్టారు.

ఏఐఎస్ఎఫ్ శిక్షణ తరగతులు

అనంతపురం అర్బన్: ఏఐఎస్ఎఫ్ రాయలసీమ జిల్లాల విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు జూలై 4 నుంచి 6 వరకు మంత్రాలయంలో జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను బుధవారం అనంతపురంలోని కార్యాలయంలో విడుదల చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయిస్వామి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే చెప్పండి

ఆత్మకూరు: గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే గొడవ పడకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్‌ఐ జనార్దన్ తెలిపారు. బుధవారం మండలంలోని పి.యాలేరులో నిర్వహించిన గ్రామసభలో ఆయన ప్రజలకు పలు సూచనలు చేశారు.

జోరుగా జగనన్న సురక్ష సర్వే

చెన్నేకొత్తపల్లి/ ఆత్మకూరు/ కనగానపల్లి: చెన్నేకొత్తపల్లి, ఆత్మకూరు, కనగానపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష సర్వే జరిగింది. ఎంపీడీఓలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొని అర్హత ఉండి సంక్షేమ పథకాలు ఇంకా ఎవరికైనా అందలేదా అని అడిగి తెలుసుకున్నారు.

స్పై చిత్రాన్ని ఆదరించండి



థియేటర్‌లో హీరోయిన్ సన్య కౌశిక్ సందడి

అనంతపురం కల్చరల్: నేతాజీ సుభాష్ చంద్ర బోస్ మరణ రహస్యాన్ని ఛేదించే ఇతివృత్తంతో తీసిన యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'స్పై'ని ఆదరించాలని హీరోయిన్ సన్యకౌశిక్ కోరారు. హీరో నిఖిల్ నటించిన స్పై చిత్రం గురువారం విడుదలవుతున్న నేపథ్యంలో బుధవారం రాత్రి నగరంలోని ఎస్వీ సినీ మ్యాక్స్ థియేటర్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆత్మీయ అతిథిగా హీరోయిన్ సన్యకౌశిక్ హాజరై ప్రేక్షకులతో ముచ్చటించారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీపీ నాయకులు అనంత చంద్రారెడ్డి, రమేష్ గౌడ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో థియేటర్ మేనేజర్ గౌడ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాక వద్దనే పశువైద్యం



మొబైల్ వెటర్నరీ అంబులేటరీ వాహనం వద్ద పశువులను పరీక్షిస్తున్న వైద్యులు



ఆవును పరీక్షిస్తున్న డాక్టర్ సునీత

పశుసంపద, జీవ సంపద పరిరక్షణే ధ్యేయంగా దేశంలో మరెక్కడా లేని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ప్రవేశపెట్టిన వైఎస్సార్ సంచార పశువైద్యశాలలు (మొబైల్ వెటర్నరీ అంబులేటరీ క్లినిక్) పాడి రైతులు, జీవాల కాపర్లకు వరంగా మారాయి. ఎలాంటి జబ్బు చేసినా 1962 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయగానే అరగంట లోపు పశువుల పాక వద్దకే అంబులెన్స్ వస్తోంది. ఉచితంగా అన్ని రకాల వైద్య సేవలు అందిస్తోంది. అవసరమైతే అరుదైన శస్త్రచికిత్సలు చేస్తూ ప్రాణాపాయం నుంచి పశువైద్యులు కాపాడుతున్నారు. మనుషుల పాలిట 108 ఎలా సేవలందిస్తోందో అలానే మూగజీవాలకు 1962 ద్వారా తక్షణ వైద్యం అందిస్తోంది. నియోజకవర్గానికి రెండు వాహనాలు ప్రస్తుతం వైద్య సేవలు అందిస్తూ కొండంత అండగా నిలుస్తున్నాయి. బుధవారం ఉదయం ఫోన్ రాగానే అనంతపురం రూరల్ మండలం కురుగుంట గ్రామానికి అంబులేటరీ క్లినిక్ ద్వారా డాక్టర్ సునీత బృందం చేరుకుని అనారోగ్యంతో ఉన్న పశువులకు సేవలందించింది. ఈ వైద్యసేవలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

ఎమ్మెల్యే 'అనంత'తోనే మైనార్టీలకు గుర్తింపు



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: టీడీపీ అధినేత చంద్రబాబు, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ముస్లింలను అణగదొక్కారని నగరపాలక సంస్థ మేయర్ వసీం ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ముస్లిం మైనార్టీలకు గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ఇటీవల జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఇమామ్ ఎమ్మెల్యే 'అనంత'పై చేసిన విమర్శలను మేయర్ ఖండించారు. బుధవారం ఆయన నగరపాలక సంస్థలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మేయర్, మార్కెట్‌యార్డు చైర్మన్, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌తో పాటు 10 కార్పొరేటర్, ఒక కో ఆప్షన్ పదవుల్లో ముస్లింలకు కల్పించిన గొప్ప వ్యక్తి ఎమ్మెల్యే అనంత అని కొనియాడారు. గత టీడీపీ హయాంలో ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ వర్గ పోరుతో నగర అభివృద్ధిని విస్మరించారన్నారు. తన భార్యకు కార్పొరేటర్ పదవి ఇవ్వలేదని ఇమామ్ చేసిన చౌకబారు మాటలను ముస్లింలు విశ్వసించరన్నారు. సమావేశంలో మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్; కార్పొరేటర్లు ఇస్సాక్, రహంతుల్లా, నాయకులు షెక్షా, దాదు తదితరులు పాల్గొన్నారు.

జగన్ చొరవతో మైనారిటీలకు రాజయోగం

అనంతపురం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ముస్లిం మైనారిటీలకు రాజయోగం లభించిందని నగర మేయర్ వసీంవక్ఫ్ బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ అన్నారు. 'హర్ దిల్ మే వైఎస్సార్–హమ్ సబ్ జగన్‌కే సాత్'లో భాగంగా బుధవారం అనంతపురం జేఎన్‌టీయూ సమీపంలోని మస్జిదే–మావా–మస్జిద్‌లో నిర్వహించిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇషాక్, రహంతుల్లా, కో–ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, సోహేబ్, ముతవల్లి రియాజ్, మసీదు కమిటీ సభ్యులు జాఫర్, ఖాదర్, షెక్షావలి, బాషా తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ప్రార్థనలు అనంతరం మస్జిద్‌కొచ్చిన ముస్లింలతో వారు మాట్లాడారు. ముస్లింల అభ్యున్నతి కోసం తమ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను వివరించారు.

పారిశుధ్య కార్మికులు విధుల్లోకి రావాలి

అనంతపురం క్రైం: పారిశుధ్య కార్మికులు ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా గురువారం వేకువజాము నుంచే విధిగా విధుల్లోకి రావాలని నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. విధుల్లోకి రానివారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉదయం 5 నుంచి 10 గంటల వరకు లేదా ఉదయం 6 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధుల్లో ఉండాలన్నారు.

సామాజిక స్థితిగతులు మెరుగుపర్చాలి

చిరు వ్యాపారుల సామాజిక స్థితిగతులను మెరుగుపర్చేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ రమణారెడ్డి మెప్మా సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థలో ప్రధానమంత్రి స్వానిధి యోజన ద్వారా నగరంలో అమలవుతున్న కార్యక్రమాలపై మెప్మా సిబ్బందితో కమిషనర్ సమావేశం నిర్వహించారు. మెప్మా ప్రాజెక్ట్ బ్యాంకింగ్ కో ఆర్డినేటర్ సి.కాటమయ్య మాట్లాడుతూ 2018లో నగరంలోని వివిధ డివిజన్ల పరిధిలోని వీధి వ్యాపారులను గుర్తించి, వారికి బ్యాంకుల ద్వారా రుణాలందించామని వివరించారు.

వడ్డీ మాఫీకి రెండ్రోజులే గడువు

మొదటి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను వడ్డీ మాఫీకి రెండు రోజులు మాత్రమే గడువుందని కమిషనర్ తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు ఐదు భాషల్లో ప్రార్థనలు

అనంతపురం కల్చరల్: దేశం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ గురువారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం వరకు ఐదుగంటలపాటు ఐదు భాషల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు కళాకారుల కాలనీలోని రేమా చర్చి ప్రతినిధులు తెలిపారు. బుధవారం సాయంత్రం చర్చిలో కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. పాస్టర్లు రెవరెండ్ మనుష్యే, జీఆర్ ఆనంద్, జాన్, ఎఫ్రాయిమ్ తదితరులు మాట్లాడుతూ ప్రత్యేక ప్రార్థనల కోసం ఏపీ, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి ప్రత్యేక అతిథులుగా దైవజనులు విచ్చేస్తున్నారని తెలిపారు.

క్విజ్ పోటీల విజేతల వీరే

రాప్తాడురూరల్: ఆర్థిక అక్షరాస్యత ప్రయత్నాలకు ఊతమిచ్చే కార్యక్రమంలో భాగంగా భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం అనంతపురంలోని సైన్స్ సెంటర్‌లో జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లాలో లీడ్ బ్యాంక్ అయిన కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. జిల్లాస్థాయి పోటీల విజేతలకు మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండో బహుమతిగా రూ.7500, తృతీయ బహుమతిగా రూ.5 వేల నగదు ప్రకటించారు. కళ్యాణదుర్గం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని జి.జ్యోత్స్న మొదటి బహుమతి, గుత్తి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని జి.షీమా జైది ద్వితీయ బహుమతి, సిద్ధరాంపురం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు బి.భావన–జి.లిఖిత తృతీయ బహుమతులకు ఎంపికయ్యారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: 'విద్యాభివృద్ధికి ఏ నాయకుడు, ఏ ప్రభుత్వం చేయలేని పని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేస్తున్నారు. అమ్మఒడితో పేద విద్యార్థులకు అండగా నిలిచి వారి భవిష్యత్‌కు బాట వేస్తున్నారు' అని ఎంపీపీ సుబ్బర హేమలత తెలిపారు. సీఎం వైఎస్ జగన్ అమ్మఒడి డబ్బులను బుధవారం మంజూరు చేయడంతో ఎంపీడీఓ కార్యాలయంలో విద్యార్థులతో కలసి అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ షర్మిల, ఎంపీడీఓ విజయప్రసాద్, ఎంఈఓ నరసింహారెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్ లీమారోజ్, వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ గూలి కొండారెడ్డి, నాయకులు వన్నూరప్ప, అంజినప్ప, అతికిరెడ్డి, సచివాలయ కన్వీనర్ ఓబీ టైలర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్యానికి పెద్దపీట



పారిశుధ్య కార్మికురాలికి రక్షణ వస్తువులను అందజేస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: పారిశుధ్య కార్మికుల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మేయర్ వసీం పేర్కొన్నారు. బుధవారం నగరపాలక సంస్థ ఆవరణలో పారిశుధ్య కార్మికులకు రక్షణ వస్తువుల్లో భాగంగా ఒక్కొక్కరికి నాలుగున్నర కిలోల కొబ్బరినూనె, 12 డిటర్జెంట్ సబ్బులు, రెండు జతల చెప్పులు, ఆప్రాన్‌ను మేయర్ అందజేశారు. మేయర్ మాట్లాడుతూ ఇటీవల పారిశుద్ధ్య కార్మికులకు రెండు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి గుండెకు సంబంధించి 2డీ ఎకో, ఈసీజీ, తదితర వైద్య పరీక్షలు చేయించామన్నారు. ప్రజారోగ్యం కోసం కార్మికులందిస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్లు రహంతుల్లా, ఇస్సాక్, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి ఎమ్మెల్యే రూ.3 లక్షల విరాళం



ఆలయ కమిటీ సభ్యులు విరాళం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో తొలి ఏకాదశి పండుగ సందర్భంగా నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రూ.3 లక్షలు విరాళంగా అందజేశారు. బుధవారం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలయ కమిటీ సభ్యులకు ఆ మొత్తాన్ని అందజేశారు. సర్పంచ్ ధనశ్రీ, వైస్ ఎంపీపీ పవన్‌కుమార్‌రెడ్డి, నాయకులు ఎస్‌టీడీ శ్రీనివాసరెడ్డి, గాలి తాతిరెడ్డి పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం



మృతుడు రామునాయక్

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: నగర శివారులోని జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బకు చెందిన రామునాయక్ (35).. అనంతపురంలోని ఆరో రోడ్డులో నివాసముంటున్న మల్లయ్య వద్ద లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా భార్యకు దూరంగా ఉంటున్న ఆయన బుధవారం రాత్రి 9.15 గంటలకు వ్యక్తిగత పనిపై రుద్రంపేట శివారులో 44వ జాతీయ రహదారి దాటుతుండగా వేగంగా దూసుకెళ్లిన వాహనం ఢీకొంది. ఘటనలో రామునాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ఉడాయించాడు. ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

'అమ్మ' పాలు ఆరోగ్యానికి మేలు

- జూలై 1 నుంచి పాల సేకరణ
- రూపాయి తక్కువకే నాణ్యమైన పాలు విక్రయం
- ఇంటి వద్దకే డెలివరీ ఇచ్చేందుకూ ఏర్పాట్లు
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: 'అమ్మ' డెయిరీ పాలు నాణ్యమైనవని, ఆరోగ్యానికి ఎంతో మేలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా వేలాదిమంది మహిళల ఆధ్వర్యంలో 'అమ్మ' డెయిరీ నడుస్తోందన్నారు. జూలై ఒకటి నుంచి పాల సేకరణ చేపట్టి.. మార్కెట్ కన్నా లీటర్‌పై రూపాయి తక్కువకే వినియోగదారులకు అందిస్తామన్నారు. బుధవారం అనంతపురం రూరల్ మండలం పాపంపేట, పిల్లిగుండ్లకాలనీ సచివాలయాల వద్ద యానిమేటర్లు, స్వయం సహాయ సంఘాల లీడర్లతో నిర్వహించిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబం 'అమ్మ' పాలనే కొనుగోలు చేయాలని కోరారు. యానిమేటర్లు, టీం లీడర్లు విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు. గతంలో పాడి రైతుల కష్టానికి తగ్గ ప్రతిఫలం లభించేదికాదన్నారు. 2019కి ముందు మూడు శాతం వెన్న కలిగిన ఆవుపాలు లీటరు రూ.20తో రైతుల వద్ద కొనుగోలు చేస్తూ బయట మార్కెట్‌లో రూ.40–45కు విక్రయించేవారన్నారు. మహిళల కష్టాన్ని ప్రైవేట్ డెయిరీల నిర్వాహకులు దోచుకున్నారని వాపోయారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయ్యాక 'అమూల్' పాలను తీసుకురావడంతో అక్రమ పాల వ్యాపారానికి అడ్డుకట్ట పడిందన్నారు. పాడి రైతులకు ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర కల్పిస్తూ వచ్చారన్నారు. 10 వేలమంది మహిళా పాడి రైతులకు సభ్యత్వం కల్పించి ఆలమూరు సమీపంలో 5 ఎకరాల స్థలంలో దాతలు సహకారం, తమ సొంత నిధులు రూ.20 కోట్లతో డెయిరీ నిర్మించామన్నారు. మహిళా రైతులకు మంచి జరుగుతూ...మరోవైపు నాణ్యమైన పాలను ప్రజలకు అందివ్వడమే ఈ డెయిరీ లక్ష్యం. మార్కెట్‌లో మంచిపేరు తెచ్చుకుంటేనే పదికాలాల పాటు మనుగడ ఉంటుందని సభ్యులకు సూచించారు. మిగిలిన డెయిరీలకంటే నాణ్యమైన పాలతో పాటు డోర్ డెలివరీ చేయాలని కూడా ఆలోచిస్తున్నామన్నారు. ములకనూరు డెయిరీని స్ఫూర్తిగా తీసుకుని అమ్మ డెయిరీని ఏర్పాటు చేశామన్నారు. విస్తృత ప్రచారం కల్పించి ప్రతి ఒక్క కుటుంబం అమ్మ డెయిరీ పాలను తీసుకునేలా చూడాలని కోరారు. సమావేశంలో డీఆర్డీఏ ఏపీడీ తులశీరామ్‌రెడ్డి, ఎంపీడీఓ పుల్లయ్య, ఏపీఎం నల్లప్ప, సీసీలు సత్యానారాయణ, శేఖర్, మునిరెడ్డి, రామ్మోహన్, వైఎస్సార్‌సీపీ నాయకులు ధనుంజయయాదవ్, మఠం శ్యాంసుందర్, డాక్టర్ శీనా, ఈశ్వరయ్య, ఎంపీటీసీ సభ్యులు కురబ వెంకటేశ్వర్లు, సందీప్‌యాదవ్, పంచాయతీ కార్యదర్శులు అశోక్‌బాబు, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

- నూతన సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు



నూతన సూపరింటెండెంట్‌కు స్వాగతం పలుకుతున్న ఆర్ఎంఓ డాక్టర్ సరస్వతి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం తదితరులు

అనంతపురం క్రైం: సర్వజనాస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించేలా చూస్తామని నూతన సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఉదయం ఆయన అనంతపురం సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్ఎంఓ డాక్టర్ సరస్వతి, డిప్యూటీ ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ శివకుమార్, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ అభిషేక్, వివిధ విభాగాల హెచ్ఓడీలు డాక్టర్ భీమసేనాచార్, డాక్టర్ ఆత్మారాం, సూపర్ స్పెషాలిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం, నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు, గ్రేడ్– 2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని పుష్పగుచ్ఛం అందించి సూపరింటెండెంట్‌కు స్వాగతం పలికారు. అనంతరం వెంకటేశ్వరరావు 'సాక్షి'తో మాట్లాడుతూ వారంలో రెండ్రోజుల పాటు ప్రభుత్వ సర్వజనాస్పత్రి, ఒక రోజు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వార్డులను తనిఖీ చేసి వైద్య సేవలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు. వైద్యులు, స్టాఫ్‌నర్సులు, సిబ్బంది సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇదిలా ఉండగా నూతన సూపరింటెండెంట్ కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్‌లను మర్యాదపూర్వకంగా క్యాంపు కార్యాలయాల్లో కలిశారు.

సంగీతంతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం కల్చరల్: సంగీతంతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. అనంత నాగ్ సంగీత్ స్వర్గ్ కల్చరల్ కమిటీ నేతృత్వంలో బుధవారం రాత్రి నగరంలోని కృష్ణకళా మందిరంలో సాయి సంగీతామృత విభావరి జరిగింది. నిర్వాహకులు నాగిన్ కరణం వెంకటప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు డీఈఓ సాయిరామ్, ఆర్డీఓ మధుసూదన్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, నాట్యాచార్యులు సంధ్యామూర్తి, వివేకానంద యోగా కేంద్ర అధ్యక్షులు రాజశేఖరరెడ్డి తదితరులు ఆత్మీయ అతిథులుగా హాజరయ్యారు. సినీ, జానపద, లలితగీతాలతో గాయనీ గాయకులు హోరెత్తించారు. జిల్లా గాయకులతో పాటూ వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన శ్రీదేవి, వరలక్ష్మి, లక్ష్మీ నారాయణ, లక్ష్మీసాయి చరిత, ధనుంజయ తదితరులు ప్రేక్షకులు కోరిన పాటలు పాడి అలరించారు. ముఖ్యంగా డీఈఓ స్వయంగా అనేక పాటలు పాడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో ఘంటసాల రామయ్య, శ్రీనిధి రఘు, బుల్లితెర నటుడు రమేష్ నీల్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగనిరతికి ప్రతీక బక్రీద్



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



వసీం, మేయర్, అనంతపురం

అనంతపురం సిటీ/ అనంతపురం క్రైం: దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుని ముస్లింలు చేసుకునే పండుగ బక్రీద్. గురువారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, ఉర్దూ అకాడమీ చైర్మన్ హిరియాల్ నదీమ్ అహమ్మద్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పర్వదినం రోజున ఖుర్బానీ ఇచ్చే ముస్లింలకు ఎంతో పుణ్యఫలం లభిస్తుందన్నారు. దైవ పరీక్షలో కట్టుకున్న భార్యను వదిలి, కన్నకొడుకు ప్రాణాలను బలిచ్చేందుకు సిద్ధపడిన మహనీయుడి త్యాగానికి గుర్తుగా ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని జరుపుకుంటారన్నారు. దైవ ప్రసన్నం కోసం తనకిష్టమైన ఎలాంటి వస్తువునైనా త్యాగం చేయాలని ఖుర్బానీ సంప్రదాయం ఏటా గుర్తు చేస్తుందని తెలిపారు.

ప్రజలందరిపై అల్లా ఆశీస్సులుండాలి

ఆత్మకూరు: త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. గురువారం బక్రీద్ సందర్భంగా ఎమ్మెల్యే ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. సంతోషంగా పండుగను జరుపుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికీ అల్లా ఆశీస్సులుండాలని ప్రార్థిస్తున్నట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చెన్నేకొత్తపల్లి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలైన సంఘటన మండల పరిధిలోని కోన కన్వాశ్రమం వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీధర్ వివరాల మేరకు... నరసింహరాయనిపల్లికి చెందిన శ్రీనివాసులు, వెల్దుర్తికి చెందిన సాయి ద్విచక్ర వాహనంపై కొనకన్వాశ్రమం వైపు నుంచి వెళ్తున్నారు. 44వ జాతీయ రహదారి వై జంక్షన్ దాటుతుండగా బెంగళూరు వైపు వెళుతున్న కారు ఢీ కొట్టింది. దీంతో వారికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: నగర శివారులోని రుద్రంపేట కూడలి వద్ద కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న వికలాంగుల కాలనీకి చెందిన అరుణ్‌కుమార్‌ను బుధవారం అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ రవిచంద్ర తెలిపారు. ఇతని వద్ద నుంచి బజాజ్ పల్సర్ బైక్, 528 మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ నరసానాయుడు, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

సంక్షిప్త సమాచారం

పేకాట కేంద్రంపై దాడి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అరవిందనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నిర్వహిస్తున్న పేకాట కేంద్రంపై టూటౌన్ పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. 13 మంది పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.2,55,500 స్వాధీనం చేసుకున్నారు. ఇందులో వెంకటరమణ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి పేకాట కేంద్రాన్ని నడుపుతున్నట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

ఫీజుల దందాపై చర్యలకు డిమాండ్

రాప్తాడురూరల్: ఫీజుల దందా చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నాయకులు బుధవారం ఆర్ఐఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి శివతేజేశ్వర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి సుధీర్, ఉపాధ్యక్షుడు భరత్ పాల్గొన్నారు.

3న వ్యాస పౌర్ణమి

అనంతపురం క్రైం: జూలై మూడో తేదీన వ్యాస పౌర్ణమిని ఘనంగా జరుపుకుందామని బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ పిలుపునిచ్చారు. బుధవారం బెస్త సేవా సంఘం జిల్లా కార్యాలయంలో వేద వ్యాస మహర్షి చిత్రపటం ఆవిష్కరణ జరిగింది. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ వేదవ్యాస మహర్షి ఫొటో ప్రతి ఇంటిలో ఉంచుకుని పూజ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రబాబు, నాగేంద్ర, గంగప్ప, బాలన్న, రమేష్, నారాయణస్వామి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.